VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ ఆదివారం 01 ఫిబ్రవరి 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 163
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



వేములవాడలో బీజేపీ జెండా ఎగరేస్తాం

3వ

# మున్సిపల్ ఎన్నికల తరవాత
# రైతు భరోసా





- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి
- సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి
- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు
- రూ.500 బోనస్ ఇస్తున్నాం
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ
- మిర్యాలగూడ ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు.



తెలంగాణ మిర్చి రైతులకు
## గుడ్ న్యూస్
- ఎనుమాముల మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు అమ్మకం



స్పీకర్ తీరు రాజ్యాంగానికే
## గొడ్డలి పెట్టు
- కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం



## తెలుగు చిత్ర పరిశ్రమకు
# పెద్దపీట
- సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
- మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.



## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో
- తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

# ముస్లింల ఓట్ల కోసం
# కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు
- నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్



మహబూబ్‌నగర్: తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు.

## కాంగ్రెస్ సర్కార్‌పై నిరుద్యోగుల ఆగ్రహం



తెలంగాణలో నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, 'హలో నిరుద్యోగి చలో ఇందిరాపార్కు' పేరుతో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్పించిన ఉద్యోగాలను తామే ఇచ్చామని కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.



## స్పీకర్ నిర్ణయం
### ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

తెలంగాణ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం ఎక్స్ వేదికగా అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో పాల్గొనడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుందని, ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయని ఆమె ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చిన ఎమ్మెల్యేకే కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్‌లు ఇవ్వడం వివాదాస్పదమైందని, అయినా ఆ విషయం స్పీకర్ దృష్టికి రాలేదా అని ఆమె అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ మారారని అనడానికి ఆధారాలు లేవంటూ పిటిషన్ కొట్టివేసిన స్పీకర్, రాజ్యాంగ బద్ధమైన చైర్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది



గుంటూరు: సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు' అన్ని÷ర్ అయ్యారు.'సిగ్గు లేకుండా ప్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ప్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ప్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ప్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి..

ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హిందూ ద్రోహి పార్టీ వైసీపీ



అమరావతి: హిందూ ద్రోహి వైసీపీ అంటూ జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ నాగబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీపై ఫైర్ అవుతూ.. బుధవారం నాడు నాగబాబు ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో.. 'ఆది శంకరుల అద్వైతం. నేను పరమాత్మను నమ్ముతాను. హిందుత్వం అనేది ఒక ధర్మం. ఇది జియోగ్రాఫికల్ ఐడెంటిటీ. ఈ పుణ్య భూమిలో పుట్టిన ప్రతిఒక్కరూ హిందువే. నా ధర్మాన్ని గౌరవిస్తూ.. ఇతరులను కించపరచకుండా బతుకుతాను. అలానే అర్చకుల జీతభత్యాల గురించి నేను శాసనమండలిలో మాట్లాడాను' అని నాగబాబు తెలిపారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణ ఘటనలను నాగబాబు ప్రస్తావించారు. '2020 సెప్టెంబర్ 6న అంతర్వేది రథం దగ్ధమైన రోజు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమాలకు తలొగ్గి కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పింది. 2023లో ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే.. అంతర్వేది కేసును అసలు తాము విచారణ చేయలేదని సీబీఐ వివరించింది. అంటే వైసీపీ నేతలు చేసిన ప్రకటనను అమలు చేయకుండా మోసం చేశారని తేలిపోయింది. మసి పూసి మారేడు కాయ చేయడంలో నిపుణులైన వైసీపీ నేతలు దీనిపై ఎందుకు మాట్లాడరు. అవతలి వారి వ్యక్తిగత జీవితాలపై వారికి ఉన్న ఆసక్తి.. హిందూ ఆలయాలపై ఎందుకు ఉంటుంది. రామతీర్థం రాముడు మనకు దైవం.. డిసెంబర్ 2020లో రాముడు తల నరికినా వైసీపీ ప్రభుత్వంలో చర్యలు లేవు. నామ్ కే వాస్తగా కేసులు పెట్టి.. చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో దోషులను శిక్షించలేదు. మీరు, మీ మంత్రులకు ఇతర వ్యక్తుల సినిమాలపై రివ్యూలు ఇచ్చే శ్రద్ధ రాముడిపై ఎందుకు ఉంటుంది' అని ఆయన అన్నారు. అయోధ్యలో రామమందిరం కల సాకారం అయితే.. చంద్రబాబు, పవన్ వెళ్లి పాలు పంచుకున్నారు. నేడు హిందువులపై ఎక్కడ లేని ప్రేమ వలక పోస్తున్న ఆ నాయకుడు అయోధ్యపై ఒక్క పోస్టు అయినా పెట్టారా?. వెళ్లలేక పోయినా కనీసం స్పందిస్తూ.. ప్రకటన అయినా విడుదల చేశారా?. పేదల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ తిరుమల వెంకన్నను దర్శనం చేసుకోవాలని చూస్తారు. అటువంటి కొండపై వసతుల ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచేశారు. ఇది సామాన్యులకు భగవంతుడిని దూరం చేయడం కాదా?. మాఫియా కోసం పేద ప్రజలను వెంకన్న స్వామికి అందకుండా చేస్తారా?. కూరగాయలు బేరమాడినట్లు సేవల పెంపులో వైసీపీ నేత సుబ్బారెడ్డి బేరం ఆడిన విధానం అందరూ చూశారు. తిరుమలపై నువ్వు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు.. టీటీడీ కామన్ గుడ్ ఫండ్ ఇచ్చే కంట్రిబ్యూషన్ రూ.2.50 కోట్లు ఉండేది.. రూ.50 కోట్లకు ఒకేసారి పెంచేశావు' అని నాగబాబు విమర్శించారు.

తిరుపతిలోనే కాదు.. ఎక్కడ కొండ కనిపించినా గుండు కొట్టేయడమే మీకు అలవాటు. డిక్లరేషన్ ను గౌరవించడం మన సంప్రదాయం. అయినా బాధ్యత గురించి వైసీపీ నేతలకు చెప్పడం చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే. పవన్ కల్యాణ్ తన సతీమణి, పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అలానే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం డిక్లరేషన్ ఇచ్చారు. అబ్దుల్ కలాం కంటే నువ్వు గొప్పోడివా.. నీ మంత్రి వచ్చి తిరుమల నీ అమ్మ మొగుడు కట్టాడా అంటాడా..?. అలా తలపొగరుతో మాట్లాడినందుకే 151 మధ్యలో 5 తీసేసి 11 సీట్లే ఇచ్చారు. అయినా నువ్వేమైనా మారావా.. డిక్లరేషన్ అడిగారని తిరుమల పర్యటన మానుకున్న చరిత్ర నీది.

సెక్యులర్, రిలీజియస్ ప్లేస్‌లకు తేడా తెలియని వ్యక్తివి నువ్వు. తిరుమల కల్తీ ఉదంతంలో అబద్దాలు చెబుతున్నారు' అంటూ వైసీపీపై నాగబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమల జోలికి వస్తే వినాశనం తప్పదు

న్యూఢిల్లీ: వైసీపీ నాయకులపై టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం కలియుగ వేంకటేశ్వర స్వామి, హిందువుల ఆధ్యాత్మిక రాజధాని తిరుమల క్షేత్రాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని సూచించారు. తిరుమల చుట్టూ రాజకీయాలు తిరిగితే వినాశనమే జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ గిరిప్రదక్షిణ చేసి పుణ్యం సంపాదించుకోవాలని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 వరకు తిరుమలలో చేసిన అపచారాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి ఢిల్లీకి వచ్చి కల్తీ నెయ్యిపై నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు అనుకుంటున్నారని.. భోగి పండుగకు డ్యాన్సులు, దీపావళికి టపాసులు తప్ప జైత్రయాత్ర చేసేది లేదని వ్యంగ్యంగా విమర్శించారు. మనిషిలాగా ప్రవర్తించాలి కాని ఆంబోతులాగా కాదని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. ఏపీ ప్రజలు ఇప్పటికే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని, అయినా సిగ్గు లేకుండా స్వామివారితో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నెయ్యి కాకుండా కల్తీ పదార్థాలు వాడారని సిట్ నివేదికలో స్పష్టంగా ఉందని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కొందరు వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలకు జైత్రయాత్ర అనేది లేదని, ఎన్నడూ లేని విధంగా దీపావళికి జగన్ మోహన్ రెడ్డి టపాసులు కాల్చారని విమర్శించారు. టపాసులు కాల్చుకోవడానికి వైసీపీ నేతల శేష జీవితం సరిపోతుందని ఆయన సెటైర్ వేశారు. 2019–2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతుంటే జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని అన్నారు. టా÷-గ్గ÷ట్ తిరుమలగా వైసీపీ నేతలు పని చేస్తున్నట్లు విమర్శించారు. వైసీపీ దుర్మార్గులు ఇప్పుడు ఏపీ మీద పడ్డారన్నారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని.. వైసీపీ నేతలు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో దృతరాష్ట్రి పాలన జరిగిందంటూ ఆయన వ్యాఖ్యానించారు. సిట్ నివేదికలో కోట్ల రూపాయలు హవాలా మార్గంలో చేతులు మారాయని తేలిందని భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న కుట్రదారులు, పాత్రధారులు బయటకు వస్తారని తెలిపారు. కుల రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా చేసుకోవద్దని సూచించారు. ఆంబోతులను రోడ్లపైకి వచ్చి.. ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఈరోజు ఇంకో నాయకుడు (జగన్) గుంటూరుకు బయలుదేరారని చెప్పారు. రోడ్డుపై ఆంబోతులు గొడవ చేస్తే వదిలేస్తామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళనలు.. జగన్ ప్రీ ప్లాన్ స్కెచ్‌గా భావిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే గందరగోళం చేస్తున్నారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు.?

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట



హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీ కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి,

అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మిర్చి రైతులకు గుడ్ న్యూస్

వరంగల్: తెలంగాణలో మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి, రైతులకు ఆశాజనకంగా మారాయి. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు, ఎల్లో మిర్చి క్వింటా 44,000 రూపాయలకు అమ్ముడయ్యింది. వండర్ హాట్ మిర్చి ధర ఒక్కరోజులో 5,000 రూపాయలు పెరిగి క్వింటా 37,100కి చేరింది. అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల, ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి తగ్గడం ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ధరల కారణంగా బాధపడ్డ రైతులకు ఈ పరిస్థితి పెద్ద ఊరటనిస్తుంది.వివిధ రకాల మిర్చి ధరలు ఊహించనంత వేగంగా పెరుగుతుండడం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. ఎల్లో, దేశీ, వండర్ హాట్ మిర్చి వంటి రకాల డిమాండ్ అంతర్జాతీయంగా కూడా ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. రైతులు తమ ఉత్పత్తిని పెద్ద ధరకు విక్రయించగలిగితే, ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ప్రతి రకానికి ప్రత్యేక ధరలు ఉన్నాయని, ధరల పెరుగుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ధరల పెరుగుదల రైతుల ఉత్సాహాన్ని పెంచింది, కానీ నిలకడైన ఆదాయం కోసం మంచి మార్కెట్ వ్యూహాలు అవసరం. పంటలను సరైన సమయంలో మార్కెట్లో విడుదల చేయడం, నిల్వ మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కీలకం. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌లను గమనించి, ధరల మార్పులపై రైతులు సరిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితులు, రైతుల ఆర్థిక

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

హైదరాబాద్,: పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ మేరకు పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కళ్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కళ్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కళ్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కళ్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు



హైదరాబాద్:ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల తరవాత రైతు భరోసా



మిర్యాలగూడ: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బడ్జెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ÷ూఒ:అ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ÷ూఒ:అ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# దివాలా కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులా?




హైదరాబాద్: రాష్ట్రంలో సుమారు రూ.6 వేల కోట్ల పనులను ఒక దివాలా కంపెనీకి కట్టబెట్టారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. 2023లోనే దివాలా తీసిన ఈ సంస్థలో కొనసాగుతున్న రూ.వందల కోట్ల ఆర్థిక లావాదేవీలపై నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టు వారం కిందటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చిందని తెలిపారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీ సంస్థ అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు."2018లో ఈ కంపెనీపై, ప్రస్తుత ముఖ్యమంత్రి బంధువుల కంపెనీలపై ఐటీ దాడులు జరిగాయి. అప్పుడే అవి రేవంత్ బంధువుల కంపెనీలని బయటపడింది. ఆయా సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఆ ఇన్‌ఫ్రా కంపెనీ పేరుతో కొనుగోలు చేసిన ల్యాండ్ క్రూయిజర్ కారును ముఖ్యమంత్రి అయ్యాక కూడా రేవంత్ వాడుకున్నారు. ఈ కంపెనీకి మరో సంస్థకు మధ్య 2023లో గొడవ జరిగింది. ఆ రెండూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను అప్రోచ్ అయ్యాయి. ఆ కేసు నడుస్తోంది. అక్కడ ఈ కంపెనీ 'కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్' పిటిషన్ వేసి... తాము దివాలా తీశామనే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి రూ.15 లక్షలు కూడా లేవని చెప్పి.. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంది. దీంతో ఈ కంపెనీలో ఆర్థిక లావాదేవీలను ఎన్‌సీఎల్‌టీ నిషేధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న కంపెనీకి... రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమృత్ స్కీమ్, జల్‌జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్ట్ పనులు, రహదారుల పనులు... కలిపి సుమారు రూ.6,000 కోట్ల కాంట్రాక్టులను అడ్డగోలుగా కట్టబెట్టారు. 2023లో దివాలా తీసిన కంపెనీకి.. 2024-26 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం ఇన్ని కాంట్రాక్టులు ఎలా ఇచ్చిందన్న విషయానికి సీఎం సమాధానం చెప్పాలి? ఈ కంపెనీ ఆర్థిక అవకతవకలపై సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్, ఈడీలతో విచారణ జరిపించాలని కేంద్రానికి, రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చినా... ఎందుకు దర్యాప్తునకు ఆదేశించలేదు? ఈ అంశాన్ని దాచిపెట్టి.. ప్రజల దృష్టిని మళ్లించడానికే నాతోపాటు హరీశ్‌రావు, సంతోష్‌రావు, కేసీఆర్‌లకు సిట్ నోటీసులిచ్చి డ్రామా నడిపించారు. ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం కాపాడుతుంది నిజం కాకపోతే... ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలి. విచారణ పూర్తయ్యే వరకూ ఈ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి.. ఇచ్చిన కాంట్రాక్టులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

**పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్**

**స్పీకర్ తీర్పును స్వాగతించిన సంజయ్**

**తాను బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నాని వెల్లడి**



హైదరాబాద్:జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ' నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా' అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు' అని వివేకానంద తెలిపారు.

# రైతులందరూ ఏకమై రేవంత్ రెడ్డి వీపు పగలగొట్టడం ఖాయం : హరీష్ రావు



వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి నేటికి 700 రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. ప్రజలను మోసం చేసిన మీరు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు..? అని కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరువు నియోజకవర్గంలోని గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీలలో హరీష్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓటు అడిగే నైతిక అర్హత లేదు. మహిళలకు మహాలక్ష్మి కింద రూ. 2500 రాలేదు, రైతులకు రూ. 15 వేల రైతు భరోసా రాలేదు. వృద్ధులకు రూ. 4000 పెన్షన్ రాలేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లేదు. నిరుద్యోగులకు మొదటి ఏడాదిలో ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన మీరు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు..?అని ప్రశ్నించారు. ఫిబ్రవరి నెల వచ్చినా ఇప్పటికీ రైతుబంధు డబ్బులు వేయలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్ నెలలోనే రైతుబంధు పడేది. ఇప్పుడు నారు పోసుడు అయిపోయింది, దుక్కి దున్నుడు అయిపోయింది, కలుపు తీయడం అయిపోయింది.. ఇప్పుడు యూరియా చల్లుతున్నారు. ఇంకెప్పుడు రైతుబంధు ఇస్తావు రేవంత్ రెడ్డి. కరోనా కష్టకాలంలో కూడా ఆపకుండా 11 సార్లు రైతుబంధు ఇచ్చి రూ. 82,000 కోట్లు రైతుల ఖాతాల్లో వేసిన ఏకైక నాయకుడు కేసీఆర్. మున్సిపాలిటీల్లో రైతులు ఉండరని, వాళ్లకు రైతుబంధు వేయకపోయినా నడుస్తుందని రేవంత్ రెడ్డి భ్రమలో ఉన్నాడు. సగం మున్సిపాలిటీల్లో ఉన్నది రైతులే. ఈ మున్సిపల్ ఎన్నికల్లో రైతులందరూ ఏకమై రేవంత్ రెడ్డి వీపు పగలగొట్టడం ఖాయమన్నారు. ఏ సబ్‌స్టేషన్‌కు వెళ్దామో రండి.. అవ్వాతాతలకు రూ. 4000 పెన్షన్ ఇవ్వకపోగా, ఉన్న పెన్షన్లలో 2 లక్షల మందికి కోత పెట్టారని హరీష్ రావు ఆగ్రహం

వ్యక్తం చేశారు. నేను కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేస్తున్నా.. ఏ సబ్‌స్టేషన్‌కు వెళ్దామో రండి. 24 గంటల కరెంటు వస్తుందా చూద్దాం.. కనీసం 12 గంటల కరెంటు కూడా రైతులకు ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పి మున్సిపల్ ఎన్నికల్లో 30 శాతం కూడా అమలు చేయలేదు. దళిత బంధు మూలనబడ్డది. గొర్రెల పంపిణీ జాడ లేదు. ఇచ్చిన ఒక్క పథకం ఫ్రీ బస్సు.. అది కూడా తుస్సుమంది. మగోళ్లకు డబుల్ టికెట్ రేట్లు పెట్టారని హరీష్ రావు ఆరోపించారు.

# గాడితప్పుతున్న పార్లమెంట్ సమావేశాలు !



పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్ధతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్ధతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷-కే చెల్లింది. అమెరికా -భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపోస్షల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే- వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు.

# సంకల్పమే సకల విజయాలకు మూలం.

**- శ్రీ కావ్య సమాఖ్య వ్యవస్థాపకులు బి. మధుసూదనరావు.**





**వేగుచుక్క న్యూస్, సిరికొండ**

విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు అంటే భయం వీడి ఆత్మవిశ్వాసంతో బాగా చదవాలని, సంకల్పమే సకల విజయాలకు మూలమని శ్రీ కావ్య సమాఖ్య వ్యవస్థాపకులు బి. మధుసూదనరావు అన్నారు. బుధవారం సత్యశోధక్ పాఠశాలలో శ్రీ కావ్య విద్యా విషయక సమాఖ్య, నిజామాబాద్ వారు పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించి, ఉచితంగా స్టడీ మెటీరియల్స్ ను (ముఖ్యమైన ప్రశ్నలతో కూడిన ) అందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కావ్య సమాఖ్య వ్యవస్థాపకులు బి. మధుసూదనరావు ప్రసంగిస్తూ, విద్యార్థులు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని వీడి, మిగిలిన ఈ నెల రోజుల కాలాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదువుతూ పునశ్చరణ చేసుకుంటే మంచి మార్కులను సులభంగా సాధించవచ్చని తెలిపారు. ప్రతి సబ్జెక్టులోని ముఖ్యమైన అంశాలని, ప్రశ్నలను ఎలా అవగాహన చేసుకొని చదవాలనే మెలకువలను మధుసూదనరావు తెలిపారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ప్రయత్నించాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య 10వ తరగతి విద్యార్థులకు ఇంత చక్కని ప్రేరణ కల్పించినందుకు కావ్య సమాఖ్య సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ

జ్ఞాపికలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు యన్. లింగం, జి. భూపతి రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందుత్వం బీజేపీ డీఎన్ఎ..

**- ఎంపీ ధర్మపురి అర్వింద్.**




**వేగుచుక్క నిజామాబాద్:**

హిందుత్వం కోసం రాజకీయాలు చేసే అవసరం తమకు లేదని, అభివృద్ధి బీజేపీ ఎజెండా అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. నిజామాబాదు కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి కార్పొరేషన్ కు బకాయి పడ్డ రూ. 8 కోట్లు ఎగవేత ధోరణితో ఇంత కాలం చెల్లించకుండా ఉన్నారని, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ కోసమే అస్తిపన్ను బకాయిలు చెల్లించాడనీ అన్నారు. మేయర్ పదవి కోసం ఒక్క రోజులో అంత పెద్ద మొత్తంలో కార్పొరేషన్ కు చెల్లించిన వ్యక్తి రేపు మేయర్ అయితే నిలువు దోపిడీ జరుగుతదని, కార్పొరేషన్ లో బహిరంగ దోపిడీ జరుగుతదని, ఇందూరు నగరాన్ని పూర్తిగా దోచుకుంటాడన్నారు.

ప్రజలను మోసం చేసిన వ్యక్తికి పోటీ చేసే నైతికత కూడా లేదన్నారు. అలాంటి వ్యక్తి రేపు మేయర్ అయితే నిజామాబాదు కార్పొరేషన్ ను శ్రీరాముడే కాపాడాలని అన్నారు. 19వ డివిజన్ లో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలన్నారు. ఇలాంటి వారిని గెలిపిస్తే సమస్యలెవరికి చెప్పుకుంటారని ప్రజలను ప్రశ్నించారు. సోనియా రేవంత్ కంటే నాకే దగ్గరని, అయినా కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి కాబట్టే నేను కాంగ్రెస్ లోకి వెళ్లలేదన్నారు.

అభివృద్దే మా ఎజెండా..


ప్రతీ రూపాయి ప్రజల కోసం ఖర్చు పెట్టి అభివృద్ధి చేయడమే బీజేపీ అజెండా అని అర్వింద్ అన్నారు. వినీతిపరులకు, పార్టీ మారిన వారికి బీజేపి టికెట్ ఇవ్వలేదన్నారు. స్వచ్ఛ పాలన కోసం బీజేపీకి ప్రజలు ఓటేయాలని కోరారు. నిజామాబాదు కార్పొరేషన్ లో బీజేపీ మేయర్ పదవి గెలిస్తే ఏ వర్గానికి, ఓటు బ్యాంక్ కు లొంగకుండా నిజామాబాద్ లో ఆక్రమణలు తొలగిస్తామని అర్వింద్ నగర ప్రజలకు హామీ ఇచ్చారు. అవినీతిరహిత పాలనను, సుపరిపాలనను అందిస్తామన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థిని ఎవరినేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మెజారిటీ, మైనార్టీ కాదు అభివృద్ధి ఎజెండా గా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిజామాబాదుకు వందే భారత్ తెచ్చే బాధ్యత నాది అని ఎంపీ అరవింద్ హామీ ఇచ్చారు. విలేఖర్ల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించట ంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

వేగుచుక్క

# వ్యాఖ్యలు వైరల్





దర్శక ధీరుడు రాజమౌళి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు సినిమాను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన సినిమాలు, అందులోని విజువల్స్ చూసి అందరూ జక్కన్నను ఇండియన్ జేమ్స్ కామెరూన్ అని పిలుస్తారు. ప్రస్తుతం మహేష్ బాబు హీరోగా రాజమౌళి.. వారణాసి చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెల్సిందే. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కనిపించనున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజమౌళి సినిమా అంటే ఒకపక్క షూటింగ్ జరుగుతూ ఉంటుంది.. ఇంకోపక్క ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టేస్తారు. వారణాసికి కూడా అదే చేశారు. వారణాసి టైటిల్ రివీల్ చేసిన వెంటనే హాలీవుడ్ మీడియాకు చిత్రబృందం కొన్ని ఇంటర్వ్యూలు ఇచ్చింది. అందుకు సంబంధించిన ఫోటోలు అప్పట్లో బాగా వైరల్ అయ్యాయి. తాజాగా ఆ ఫుల్ ఇంటర్వ్యూలు రిలీజ్ అయ్యాయి. ఈ ఇంటర్వ్యూలలో రాజమౌళి, మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా.. వారణాసికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

ఒక ఇంటర్వ్యూలో రాజమౌళి.. వారణాసి సినిమాను అవతార్ తో పోల్చడంపై స్పందించారు. విజువల్స్ పరంగా వారణాసి.. అవతార్ లా ఉండబోతోందని వార్తలు వచ్చాయి. దానిపై జక్కన్న మాట్లాడుతూ.. ' జేమ్స్ కామెరూన్ లాంటి వ్యక్తితో నన్ను పోల్చడం నాకు చాలా గౌరవంగా ఉంది. కానీ, ఆయనతో నన్ను పోల్చకండి. ఆయన ఒక శిఖరం లాంటివారు. ఒక మాస్టర్.. నేను ఇంకా నేర్చుకుంటున్న విద్యార్థినే' అని తెలిపారు. అంతేకాకుండా వారణాసి గురించి మాట్లాడుతూ.. 'ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడుతున్నాం. వారణాసి నిడివి 3 గంటల 20 నిముషాలు ఉంటుంది. అంతసేపు ప్రేక్షకుడిని థియేటర్ లో కూర్చోబెట్టాలి. 3 నిముషాలు బోర్ కొట్టించినా ప్రేక్షకుడు ఫోన్ పట్టుకుంటాడు. అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టనివ్వకుండా తెరకెక్కిస్తున్నాం. ప్రతి సీన్ కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు.



# మీకేం తెలుసు

ఈమధ్యనే మెగా ఇంటికి ఇద్దరు వారసులు వచ్చిన విషయం తెల్సిందే. రామ్ చరణ్ – ఉపాసన రెండోసారి ట్విన్స్‌కి జన్మనిచ్చారు. దీంతో మెగా ఫ్యామిలీ ఇంట పండుగ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియా మొత్తం చరణ్–ఉపాసనకు శుభాకాంక్షలు చెప్పారు. కానీ, కొంతమంది మాత్రం చిరంజీవిపై విమర్శలు గుప్పించారు. మనవడు పుట్టేసరికి చిరు హాస్పిటల్ వద్ద హడావిడి చేశారని, క్రాకర్స్ కాల్చి సందడి చేశారని.. అదే మనవరాలు క్లింకార పుట్టినప్పుడు ఇదంతా ఏమైంది.. కేవలం మనవడు పుడితేనే హ్యాపీనా అంటూ పోస్టులు పెట్టారు.


తాజాగా ఆ పోస్ట్ పై లావణ్య స్పందించింది. చిరంజీవి ఎలాంటివారో తెలియనప్పుడు ఆయన గురించి మాట్లాడవద్దని తెలిపింది. ఆయనలా ఏ పురుషుడు కూడా ఉండరు అని చెప్పింది. 'నేను సాధారణంగా ఇలాంటి ట్వీట్‌లను పట్టించుకోను. వాటిని నా టైమ్‌లైన్‌లో అలా వదిలేస్తాను. కానీ, మీ నుండి ఇలాంటిది నేను ఊహించలేదు.. ఈ ట్వీట్ చాలా అసభ్యకరంగా ఉంది, ఇది నిజంగా సంతోషకరమైన క్షణాన్ని అసహ్యకరమైనదిగా మార్చింది. ఆయన తన కుటుంబంలోని మహిళలతో, ముఖ్యంగా తన మనవరాళ్లతో ఎలా ప్రవర్తిస్తారో మీకు స్పష్టంగా తెలియదు. ఆయన చేసే దానిలో 1% కూడా చాలామంది పురుషులు చేయరు. కాబట్టి మీకు నిజంగా తెలియని వ్యక్తుల గురించి వ్యాఖ్యానించకపోవడమే మంచిది' అంటూ ఫైర్ అయ్యింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ చూసిన మెగా ఫ్యాన్స్ మెగా కోడలు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఎంతైనా మెగా ఫ్యామిలీ కదా అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

లావణ్య త్రిపాఠి.. చిరంజీవి తమ్ముడు నాగబాబు కుమారుడు వరుణ్ తేజ్ ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ జంటకు గతేడాది ఒక బాబు జన్మించాడు. అతనికి వాయువ్ తేజ్ అని పేరు పెట్టారు. పెళ్లి తరువాత ఒక వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లావణ్య ప్రస్తుతం తల్లి బాధ్యతలను నిర్వర్తిస్తోంది. ఆమె నటించిన 'సతీ లీలావతి' సినిమా విడుదల కావాల్సి ఉంది. మరి ముందు ముందు సినిమాలు చేస్తుందా.. ? ఆపేస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.



# యాక్షన్ థ్రిల్లర్

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయ కుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబి నేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పో యి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువ కుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది.ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.






# రిలీజ్ డేట్

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'బైకర్' కొత్త విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ మంగళవారం వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "ఇంజిన్ స్టార్ట్ అయింది. ట్రాక్ సిద్ధంగా ఉంది. ఇక అతడిని ఆపలేరు" అంటూ క్యాప్షన్ జోడించింది.

వాస్తవానికి ఈ చిత్రాన్ని గత ఏడాది డిసెంబర్ 6న విడుదల చేయాలని ముందుగా భావించారు. అయితే, ప్రేక్షకులకు ఒక సాధారణ సినిమాను కాకుండా, మునుపెన్నడూ చూడని గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని 3డి, 4డిఎక్స్ వంటి అధునాతన ఫార్మాట్లలో కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శర్వానంద్ ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్‌గా కనిపించనున్నారు. సినిమాలోని రేసింగ్ సన్నివేశాలు, స్టంట్స్ ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తాయని చిత్ర యూనిట్ చెబుతోంది. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శర్వానంద్‌కు జోడీగా మాళవిక నాయర్ నటిస్తోంది. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, జె. యువరాజ్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 90వ దశకం, 2000ల ఆరంభం నాటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో మూడు తరాల కుటుంబ కథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

# మూడో తరం

తెలుగు సినీ యవనికపై విప్లవ కేతనం ఎగరేసిన వ్యక్తి రెడ్ స్టార్ మాదాల రంగారావు వెండితెరపై విప్లవశంఖం పూరించి, యువతరం థియేటర్ల వైపు కదిలేలా చేశారాయన. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తన సత్తాను చాటారు. విప్లవశంఖం, యువతరం కదిలింది, ఎర్రమల్లెలు, మహాప్రస్థానం, విప్లవ శంఖం, నవోదయం, ప్రజాశక్తి' వంటి ఎన్నో విప్లవాత్మక చిత్రాలలో ఆయన నాయకుడిగా నటించారు. విశేషం ఏమంటే వైద్యవృత్తిని చదివినా ఆయన కుమారుడు మాదాల రవి సైతం తండ్రి బాటలో నటుడిగా మారారు. 'నేను సైతం, మా ఇలవేల్పు, బ్రోకర్ 2, పంచముఖి' వంటి చిత్రాలలో నటించారు. కొన్ని సినిమాలను నిర్మించారు.ఇప్పుడు మాదాల కుటుంబం నుండి మూడో తరం హీరో వెండితెరపైకి వస్తున్నాడు. విదేశాలలో ఎం.బి.ఎ. విద్యను అభ్యసించిన మాదాల రవి తనయుడు సన్నీ హీరోగా పరిచయం అవుతున్నాడు.

'ఓ టార్చర్ ప్రేమ' అనే సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, 'మా మాదాల రంగారావు గారి మనవడు, మాదాల రవి కుమారుడు మూడోతరం హీరో సన్నీ మాదాల హీరో గా పరిచయం అవుతున్నాడు. తాత మార్గం, తండ్రి మార్గం విప్లవం అయితే మూడోతరం హీరో సన్నీ మాదాల ప్రేమ మార్గం ని ఎన్నుకున్నాడు. 'ఓ టార్చర్ ప్రేమ' అనే అద్భుతమైన ప్రేమ కథ చిత్రంతో వస్తున్నాడు. రచన దర్శకత్వం అనేది మేం చాలా చిత్రాలకి వహించాం, కానీ దర్శకుడు శ్రీకర్ కృష్ణ మన దాసరి నారాయణ రావు గారి రీతిలో రచన, దర్శకత్వంతో పాటు నిర్మాణం కూడా అందించాడు. ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.





# ప్రశంసలు

సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాణంలో విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎంఎం నాయుడు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సుమతి శతకం'.అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. సీరియల్స్, బిగ్‌బాస్ ద్వారా ప్రతి ఇంట్లో ఒకరిగా అందరికీ పరిచయమైన అమర్దీప్ రవితేజ అభిమాని అని అందరికీ తెలిసిన విషయమే. ఈ చిత్రానికి సంబంధించిన కంటెంట్ చూసిన రవితేజ స్పందిస్తూ... "అమర్దీప్, నీ సినిమా సుమతీ శతకం చిత్ర టీజర్, ట్రైలర్ ఇంకా ఇతర కంటెంట్ చూడడం జరిగింది. నాకు బాగా నచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని, నీ భవిష్యత్తు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. జీరో కట్స్‌తో యు/ఎ సర్టిఫికెట్, సెన్సార్ బోర్డు నుండి ప్రశంసలు రావడం మరొక ప్రత్యేకమైన విషయం. చాలా రోజులు తరువాత ఫీల్ గుడ్ సినిమాను చూస్తున్నామని సెన్సార్ అభిప్రాయపడింది. ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లోని నార్త్ అమెరికాలో వైబ్రంట్ సినిమాస్, అమెరికాలోని డల్లాస్‌లో రవి కొల్లిపార, జై పాకాల విడుదల చేయనున్నారు.





# క్రేజీ కాంబో

కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది ధనుష్ కెరీంలో 55వ సినిమా. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌కి వెళ్లనుంది. నివరాలో నటించే ప్రధాన నటీనటులు, టెక్నిషియన్స్ వివరాలను మేకర్స్ వెల్లడిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఓ క్రేజీ అప్డేట్ అందించారు. ధనుష్ సినిమాలో సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నట్లు చిత్ర బృదం ఇటీవల ప్రకటించింది. ఇందులో ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి కూడా భాగమైనట్లు అధికారికంగా వెల్లడించింది. "బిగ్ వీ ఒక కథను ఎంచుకుంటే, అది చరిత్రగా మారుతుంది. మెగాస్టార్ మమ్ముట్టి గారిని స్వాగతించడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నాము. గౌరవంగా భావిస్తున్నాము. థాంక్యూ మమ్ముట్టి సార్" అని సోషల్ మీడియాలో మేకర్స్ పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలతో ఆయన కలిసి దిగిన ఫోటోలను పంచుకున్నారు.

మమ్ముట్టి రాకతో ధనుష్ 55వ సినిమా మరింత క్రేజీగా మారిందని చెప్పాలి. ఇద్దరు నేషనల్ అవార్డు విన్నింగ్ యాక్టర్స్ కలిస్తే, బాక్సాఫీస్ షేక్ అవ్వడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. మాలీవుడ్ సీనియర్ హీరోలలలో ఒకరైన మమ్ముట్టి.. గత కొన్ని దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, వైవిధ్యమైన సినిమాలతో మెప్పించారు. క్యారక్టర్ నచ్చితే ఇతర హీరోల సినిమాల్లోనూ నటించడానికి మమ్ముట్టి రెడీగా ఉంటారు. ఇప్పుడు 'ఐ 55' చిత్రానికి సైన్ చేశారంటే, కచ్చితంగా ఆయన పాత్ర స్పెషల్ గా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా సినిమా రూపొందనుందని టాక్. 'అమరన్' తర్వాత రాజ్ కుమార్ పెరియ స్వామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ ఇది. ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల వంటి స్టార్ కాస్టింగ్ నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వుండర్‌బార్ ఫిల్మ్స్ బ్యానర్ లో ధనుష్ స్వీయ నిర్మాణంలో ఈ సినిమా రూపొందుతోంది. సాయి అభ్యాంకర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు.